సాక్షి సిద్దిపేట
ఆదివారం । 28 । జూలై । 2024

న్యూస్‌రీల్

మధ్యాహ్న భోజనంలో పురుగులు

- విద్యార్థుల ఆందోళన



టీచర్లు, మధ్యాహ్న భోజన కార్మికులతో వాగ్వాదానికి దిగిన విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్నాయని ఎలా తింటామని మండలంలోని చెప్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు శనివారం ఆందోళనకు దిగారు. వారం పది రోజులుగా భోజన వంట నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతోనే పురుగులు వస్తున్నాయని ఆరోపించారు. మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్నాయని టీచర్ల దృష్టికి తెచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో కొద్దిసేపు విద్యార్థులకు టీచర్లు, మధ్యాహ్న భోజన నిర్వాహకుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. ఉన్నతాధికారులు స్పందించి నాణ్యమైన పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్‌ చేశారు.

కేంద్ర మంత్రి సంజయ్ రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న లక్ష్మి, నాయకులు

హుస్నాబాద్‌: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించకుండా ఎన్డీఏ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని కాంగ్రెస్‌ జిల్లా మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి కరీంనగర్‌ జిల్లాకు నిధులు కేటాయించలేదన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ నాయకులు అనడం సరికాదన్నారు. కేంద్ర బడ్జెట్‌ ప్రభుత్వానికి కాపాడుకోవడమే తప్ప ప్రజల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన బడ్జెట్‌ కాదన్నారు. తెలంగాణకు ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా అన్యాయం చేసిన దౌర్భాగ్య సర్కారు ఎన్డీఏ అని మండిపడ్డారు. దీనికి కేంద్ర మంత్రి బండి సంజయ్‌ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు బంక చందు, కౌన్సిలర్‌లు చిత్తారి పద్మ, సరోజన, నాయకులు అక్కు శ్రీనివాస్‌, కిష్టస్వామి, తిరుపతి, బాలయ్య, కుమార్‌ తదితరులు ఉన్నారు.

13 నెలలుగా వేతనాల్లేవు

- పశువైద్య సంచార వాహన సిబ్బంది ఆవేదన

గజ్వేల్‌రూరల్‌: పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించేలా ప్రభుత్వం చొరవ చూపాలని పశువైద్య సంచార వాహన (1962) సిబ్బంది కోరారు. ఈ సందర్భంగా శనివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో మూగజీవాలు, పశువులకు (1962 సంచార వైద్యశాల) అంబులెన్స్‌ ద్వారా ఉచిత వైద్య సేవలందిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి ఒక అంబులెన్స్‌లో నిత్యం వెటర్నరీ డాక్టర్‌, ప్యారవెట్‌, డ్రైవర్‌, అటెండర్‌లు విధులను నిర్వహిస్తున్నారన్నారు. 13 నెలలుగా వేతనాలు రాకపోవడంతో దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వెంటనే వేతనాలు విడుదల చేయాలని కోరుతున్నారు.

సామూహిక విష్ణు పారాయణం



పారాయణం చేస్తున్న మహిళలు

వర్గల్‌(గజ్వేల్‌): ఆషాఢ మాసం చివరి శనివారం సందర్భంగా దేవదేవుని సన్నిధానంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ ఆధ్వర్యంలో సత్సంగసమితి, భ్రమరాంబిక సేవాసమితి బృందం నాచగిరి శ్రీలక్ష్మీనృసింహుని సన్నిధిలో సామూహిక పారాయణం నిర్వహించారు. ఆలయ ఈఓ అన్నపూర్ణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖమండపంలో ఆకొండ సూర్యనారాయణశాస్త్రి, మహాలక్ష్మి ఆధ్వర్యంలో బృందసభ్యులు విష్ణు సహస్రనామ పారాయణం చేపట్టారు. లక్ష్మీసమేత నృసింహునికి అర్చన జరిపారు. స్వామిని స్మరిస్తూ కోలాటాలు ఆడుతూ భక్తిపారవశ్యంలో మునిగితేలారు. ఈ సందర్భంగా క్షేత్రంలో ఆధ్యాత్మికలు వెల్లివిరిశాయి. కార్యక్రమంలో భక్తజనులు, ఆలయ సిబ్బంది పాల్గొని స్వామివారి ఆశిస్సులు పొందారు.



మౌనదీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిద్దిపేట జిల్లా పెన్షనర్ల జేఏసీ నాయకులు

నాలుగు డీఏలను విడుదల చేయండి

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని మౌన దీక్షకు చెందిన పోస్టర్‌ను శనివారం జిల్లా కేంద్రంలో సిద్దిపేట జిల్లా పెన్షనర్ల జేఏసీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా పెన్షనర్ల జేఏసీ నాయకులు మాట్లాడుతూ, ఈనెల 30న హైదరాబాద్‌లో ఉన్న ఇందిరా పార్క్‌ వద్ద మౌన దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పెన్షనర్‌లు అందరం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే ప్రకటించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని కార్పొరేట్‌ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్య చికిత్స అందజేయాలన్నారు. అలాగే ఐఆర్‌ను 20 శాతం పెంచాలన్నారు. కమ్యూటేషన్‌ విలువ రిస్టోర్‌ కాలాన్ని 12 సంవత్సరాలకు తగ్గించాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న పెన్షనర్లకు ప్రత్యేక ఇంక్రిమెంట్‌ ఇవ్వాలని, ప్రత్యేక డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్‌ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో రూ.398 వేతనంతో నియమింపబడ్డ ప్రత్యేక ఉపాధ్యాయులకు ఆంధ్రలో నోషనల్‌ ఇంక్రిమెంట్లను ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేసిందన్నారు. తెలంగాణ సర్కారు కూడా ఉత్తర్వులు విడుదల చేయాలన్నారు. సిద్దిపేట జిల్లా పెన్షనర్ల జేఏసీ నాయకులు జోగు భిక్షపతి పాల్గొన్నారు.

ఆ తండా.. ఉద్యోగులే నిండా

సండే స్పెషల్

గుడుంబా అమ్మిన చోటే.. గుబాళించిన విద్యా కుసుమాలు

- ఇద్దరు ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకొని ముందుకు..
- గురువుల బాటలో చదువుల వైపు గిరిపుత్రులు
- ప్రభుత్వ కొలువుల్లో 100 మంది, 20కి పైగా ప్రైవేట్‌ ఉద్యోగులు
- ప్రొఫెసర్లు, వైద్యులు, టీచర్లు, పోలీసులు, మహిళా లైన్‌మెన్‌గా విధులు



అదో మారుమూల తండా. గతంలో ఈ తండా వాసులు వ్యవసాయం చేయడం.. ఊరూరా తిరుగుతూ ఎడ్లబండ్ల మీద కలపను విక్రయించడం, గుడుంబాను తయారుచేసి అమ్ముకుంటూ జీవనం సాగించేవారు. జానెడు పొట్ట కోసం రెక్కలు ముక్కలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకునేవారు. కానీ తండాలో ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. 'కట్టెలమ్మిన చోటే పూలు అమ్మాలే నానుడి'ని నిజం చేశారు గిరిపుత్రులు. ఒకప్పుడు గుడుంబా అమ్మిన ఈ ప్రాంతం.. నేడు విద్యా కుసుమాలతో గుబాళిస్తోంది. విద్యావంతులకు వేదికైంది. ఈ తండాలో ఒక్కరు కాదు ఇద్దరు కాదు.. ఏకంగా 120 మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. ఉపాధ్యాయులు కునుసోతు భద్రునాయక్‌, లావుద్య కిషన్‌నాయక్‌లను ఆదర్శంగా తీసుకొని ఇక్కడి యువత విద్యావంతులుగా మారారు. దీంతో చుట్టుపక్కల గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది హుస్నాబాద్‌ మండలం భల్లునాయక్‌ గిరిజన తండా.

- దుండ్ర ఎల్లయ్య
హుస్నాబాద్‌ రూరల్‌:

10లో

కిరాణమా.. రేషన్‌ షాపా?

- డీలర్ల నయా దందా
- బియ్యానికి బదులు నిత్యావసరాలు, డబ్బుల ఆఫర్‌
- ఉమ్మడి మెదక్‌ జిల్లాలో 8.83 లక్షల కార్డుదారులు
  17 వేల మెట్రిక్‌ టన్నుల బియ్యం
- పట్టించుకోని సివిల్‌ సప్లయ్‌ అధికారులు

సాక్షి, సిద్దిపేట: పేదలకు రేషన్‌ బియ్యం పంపిణీ చేసే డీలర్లలో కొందరు అక్రమాలల్లో కొత్త దందాకు తెరలేపుతున్నారు. రేషన్‌ బియ్యానికి బదులు కిరాణా సరుకులు లేదా డబ్బులను లబ్ధిదారులకు అందజేస్తున్నారు. ఇలా కార్డుదారులను వారు పక్కదారి పట్టిస్తున్నారు. బియ్యం దందా పై ప్రభుత్వం పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో దందా యథేచ్ఛగా కొనసాగుతోంది.

ప్రతినెలా 1 నుంచి 18వ తేదీ వరకు రేషన్‌

ఉమ్మడి మెదక్‌లో రేషన్‌ షాప్‌లు 2,080, రేషన్‌ కార్డులు 8,83,841 ఉండగా 17,991 మెట్రిక్‌ టన్నుల బియ్యంను జూలై నెలలో కేటాయించారు. ప్రతి నెలా 1 నుంచి 18వ తేదీ వరకు కార్డుదారులకు రేషన్‌ షాప్‌ల ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. బియ్యం పక్కదారి పట్టకుండా ఉండాలన్న ఉద్దేశంలో ప్రభుత్వం బయోమెట్రిక్‌, ఓటీపీ, ఐరీస్‌ ద్వారా పంపిణీ చేస్తున్నారు. లబ్ధిదారుడి చేతి వేలిముద్రలు తీసుకొని వారికి బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేయాలి. ఈ దొడ్డు రైస్‌ తినడానికి నిరాకరిస్తున్నారు. సన్న బియ్యాన్ని తినడానికి ఇష్టపడుతున్నారు. ఇదే అదనుగా చేసుకొని రేషన్‌ డీలర్లు కిలో బియ్యంను రూ.5 నుంచి రూ. 6లకు కొంటున్నారు. లబ్ధిదారుల వేలిముద్రలు లేదా ఓటీపీ నమోదు చేసుకుని నిత్యావసర వస్తువులు ఇస్తూ రేషన్‌ షాప్‌లను నిత్యావసరాల దుకాణాలు మారుస్తున్నారు. మరికొందరికి నేరుగా డబ్బులను ఇస్తున్నారు. ఒక వేళ బియ్యాన్ని లబ్ధిదారులు తీసుకుంటే సబ్బులు, ఉప్పు, పప్పు ఏదైనా కొనాలని కొందరు డీలర్లు అంటగడుతున్నారు.



రేషన్‌ షాప్‌లో కిరాణా సరుకులు



పక్క దారి పడుతున్న రేషన్‌

ప్రజలకు పంపిణీ చేస్తున్న రేషన్‌ బియ్యాన్ని డీలర్లు పక్కదారి పట్టిస్తున్నారు. వినియోగదారుల నుంచి తీసుకున్న బియ్యాన్ని రూ.12 నుంచి 15 వరకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. దళారులు వీటిని కొనుగోలు చేసి కోళ్ల ఫారాలు, హోటళ్లు, బీర్‌ల ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. మరికొందరు నేరుగా రైస్‌ మిల్లు యజమానులకు విక్రయిస్తున్నారు. రైతుల నుంచి సేకరించిన వడ్లను సీఎంఆర్‌ చేసి బియ్యాన్ని రైస్‌ మిల్లుల యజమానులు అందిస్తుంటారు. అలా అందించడం వల్ల రిసైక్లింగ్‌ చేసి సీఎంఆర్‌ కింద సివిల్‌ సప్లయ్‌కు అందజేస్తున్నారు.

పట్టుబడుతున్న బియ్యం

రేషన్‌ డీలర్లు, పలువురు రేషన్‌ బియ్యం దందాను జిల్లాలో జోరుగా నిర్వహిస్తున్నారు. ప్రతి నెలా టన్నుల కొద్ది బియ్యం పట్టుబడుతున్నాయి. అక్రమంగా సరఫరా చేస్తున్న రేషన్‌ను పోలీసులే పట్టుకుంటున్నారే తప్ప సివిల్‌ సప్లయ్‌ అధికారులు మాత్రం దృష్టి పెట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి అక్రమ దందాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

జిల్లా	రేషన్‌ షాప్‌లు	కార్డులు	బియ్యం (మె.టన్నుల్లో)
మెదక్‌	521	2,13,859	4,372
సిద్దిపేట	697	2,91,400	5,710
సంగారెడ్డి	862	3,78,582	7,909

కిరాణా సరుకులు విక్రయించవద్దు



రేషన్‌ షాప్‌ల్లో ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం, గోధుమలు, చక్కెరలు విక్రయించాలి. అలాగే రేషన్‌ను ప్రతి లబ్ధిదారుడికి అందించాలి. కిరాణా సరుకులు లబ్ధిదారులకు అంటగడితే చర్యలు తప్పవు.

– తనూజ, డీఎస్‌ఓ

సమస్యలపై సమష్టిగా పోరాడుదాం



రమణయ్యకు వినతిపత్రాన్ని అందిస్తున్న జిల్లా నాయకులు

టింబర్స్‌ ఫెడరేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు రమణయ్య

సిద్దిపేటజోన్‌: టింబర్స్‌, సామిల్స్‌ సమస్యలు తలెత్తకుండా సమష్టిగా పోరాడుదామని తెలంగాణ రాష్ట్ర టింబర్స్‌ ఫెడరేషన్‌ అధ్యక్షుడు రమణయ్య పిలుపునిచ్చారు. శనివారం స్థానిక టీటీడీ మండపంలో జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంకేతికపరంగా సమస్యలను పరిష్కరించడానికి అటవీ శాఖ వైఫల్యం చెందిందని విమర్శించారు. రెండేళ్లుగా సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వంతో పోరాడుతున్నామన్నారు. అటవీ శాఖ అధికారులు, ఉద్యోగుల నిర్లక్ష్యం వల్ల కొన్ని సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. ఆన్‌లైన్‌లో రెండు రోజుల్లో పర్మిట్‌ రాని పక్షంలో మ్యాన్యువల్‌ పద్ధతిలో ఇవ్వాలన్నారు. కొన్ని సమస్యలు కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్నాయని, ఆగస్టు 7న అహ్మదాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి టింబర్స్‌ ఫెడరేషన్‌లో దీనిపై సమీక్షిస్తామన్నారు. నిజాయితీగా వ్యాపారం చేస్తున్న తాము అటవీ శాఖ అధికారులకు భయపడే ప్రసక్తి లేదన్నారు. ముందుగా చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అటవీ శాఖ అధికారుల వేధింపులు, అక్రమ కేసులను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిని జిల్లా ప్రతినిధులు అందజేశారు. జిల్లా అసోసియేషన్‌ అధ్యక్షుడు ఎన్‌కే రెడ్డి, సాయన్నగారి సుందర్‌, సత్యనారాయణ పాల్గొన్నారు.



ఆస్పత్రి పరిసరాలను పరిశీలిస్తున్న కాయకల్ప బృందం సభ్యులు

ప్రభుత్వాస్పత్రి సందర్శన

గజ్వేల్‌రూరల్‌: కాయకల్ప బృందం సభ్యులు పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని శనివారం సందర్శించారు. వారికి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ సాయికిరణ్‌ ఆస్పత్రిలోని పరిసరాలు, వార్డులను చూపించారు. అనంతరం బృందం సభ్యులు డాక్టర్‌ దశరథ్‌, ప్రశాంత్‌, నరేందర్‌రాజన్‌లు రికార్డులను పరిశీలించి, రోగులతో మాట్లాడారు. ఇక్కడ అందజేస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు.



కరపత్రాన్ని విడుదల చేస్తున్న శ్రీనివాస్‌ మాదిగ

పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు పెట్టాలి

ప్రధాని మోదీ ఇచ్చిన హామీని నెరవేర్చాలి
ఎమ్మార్పీఎస్‌ జాతీయ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ శ్రీనివాస్‌ మాదిగ

తొగుట(దుబ్బాక): మాదిగ, మాదిగ ఉపకులాల ఓట్ల పై ఉన్న ప్రేమ ఎస్సీ వర్గీకరణ మీద చూపడం లేదని ఎమ్మార్పీఎస్‌ జాతీయ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ గుర్రాల శ్రీనివాస్‌ మాదిగ ఆరోపించారు. ఆగస్టు 9న ఢిల్లీలో నిర్వహించే మహాధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని మండల కేంద్రంలో శనివారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీల్లోని 59 కులాలకు సమాన పంపిణీ జరగాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయకపోవడంతో విద్య, ఉద్యోగ, సంక్షేమ పథకాల్లో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. బీజేపీ ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉన్నా వర్గీకరణ చేయలేకపోయిందని మండిపడ్డారు. 2023లో జరిగిన ఎన్నికల సమయంలో హైదరాబాద్‌ సభలో ప్రధాని మోదీ.. మాదిగ, మాదిగ ఉప కులాలకు న్యాయం చేస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. బీజేపీ పార్టీ అగ్ర నాయకులు వర్గీకరణకు అనుకూలంగా మాట్లాడినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్‌ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదించాలని డిమాండ్‌ చేశారు. మహాధర్నాకు జిల్లాలోని మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎల్లారెడ్డిపేట మాజీ ఎంపీటీసీ స్వామి, మాజీ ఉప సర్పంచ్‌ ప్రవీన్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్‌ జిల్లా అధ్యక్షుడు లింగాల కృష్ణ, నాయకులు వెంకట్‌ పాల్గొన్నారు.

పిల్లలకు టీకాలు తప్పనిసరి

డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ శ్రీనివాస్‌



ఎన్సాన్‌పల్లి అంగన్‌వాడీలో రికార్డులను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌

సిద్దిపేటఅర్బన్‌: వ్యాధి నిరోధక టీకాలను పిల్లలకు నిర్ణీత సమయంలోగా వేయాలని, దీంతో సోకే వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చని డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ పుట్ల శ్రీనివాస్‌ అన్నారు. సిద్దిపేట అర్బన్‌ మండలం ఎన్సాన్‌పల్లి.. అంగన్‌వాడీ లో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లలకు, గర్భిణులకు తప్పకుండా సమయంలోగా అందించాలని సూచించారు. వారికి అందుతున్న పౌష్టికాహారం, ఆరోగ్య సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్లు పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వయసుకు తగ్గ బరువు ఉన్నారా లేదా అని గ్రోత్‌ చాట్‌ ద్వారా తెలుసుకోవాలన్నారు. ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వయసుకు తగిన బరువు లేని, పోషకాహార లోపంతో ఉన్న వారిని దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులకు చూపించి తగిన సలహాలు సూచనలు తీసుకోవాలన్నారు. సీజనల్‌ వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి గ్రామాల్లో ఫీవర్‌ సర్వే పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి మంగళ, శుక్రవారం డ్రై డే తప్పకుండా పాటించాలని చెప్పారు. సీజనల్‌ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ శ్రీనివాస్‌, ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ఫీవర్‌ సర్వే...

మండలంలోని పొన్నాల, మధిర, బట్టిరామన్నపల్లిలో హెల్త్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ సునంద ఫీవర్‌ సర్వే నిర్వహించారు. అర్బన్‌ తహసీల్దార్‌ సలీం పర్యవేక్షించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి గీత, అంగన్‌వాడీ టీచర్స్‌ ఉన్నారు.

వచ్చే స్థానికంలో సత్తా చాటాలి

- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి



మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ పట్టణ కార్యవర్గసభ్యులు

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా అందరం కలిసి ముందుకు సాగుదామని, జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో పట్టణ అధ్యక్షుడు కోడూరి నరేశ్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి ప్రజా సమస్యలపై పోరాడాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అభివృద్ధి పేరుతో సిద్దిపేట మున్సిపాలిటీలో అంతులేని అవినీతి జరిగిందని ఆరోపించారు. కనీస సౌకర్యాలు, ప్రజల కష్టనష్టాలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ కండువా కప్పుకొని ప్రజల చేత ఎన్నుకోబడిన నాయకులే రాజ్యాంగ వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. మున్సిపల్‌ పరిధిలో ఎక్కడ చూసినా కుక్కలు వీర విహారం చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నా పాలకవర్గం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. వర్షం పడితే రోడ్లు చిత్తడిగా మారి ఎక్కడ చూసినా మురుగు గుంతలుగా మారి వాహనదారులకు, పాదచారులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నాయని, అయినా మరమ్మతు చేయని దుస్థితిలో మున్సిపాలిటీ ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్‌ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించేలా అందరం ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సొప్పదండి విద్యాసాగర్‌, వంగ రామచంద్రారెడ్డి, అంబడిపల్లి శ్రీనివాస్‌, నీలం దినేశ్‌, బొమ్మగాని పద్మ, తొడుపునూరి వెంకటేశం, తమ్మిశెట్టి వీరేశం, పిట్ల నరేశ్‌, బొడ్డు సునీల్‌, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మారథాన్‌

సిద్దిపేటజోన్‌: మత్తు పదార్థాల నిషేధం, ఆరోగ్యాన్ని కాపాడే ప్రయత్నం పిలుపుతో ఆదివారం రంగనాయక సాగర్‌ వద్ద హాఫ్‌ మారథాన్‌ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బాపురెడ్డి, నిరంజన్‌, రాజులు పేర్కొన్నారు. శనివారం స్థానిక విపంచి ఆడిటోరియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సిద్దిపేట పోలీస్‌ కమిషనరేట్‌, రన్నర్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో మారథాన్‌ జరగనుందన్నారు. ఆదివారం ఉదయం 5 గంటలకు రంగనాయక సాగర్‌ వద్ద ప్రారంభం కానుందని పేర్కొన్నారు. 21, 10, 5 కి.మీ విభాగంలో జరగనుందని తెలిపారు. 3 వేల మంది క్రీడాకారులు ఆన్‌లైన్‌ ద్వారా పేర్లు నమోదు చేసుకున్నారన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర కీలకం



వ్యాయామ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న డీఈఓ తదితరులు

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దడంలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర కీలకం అని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి కొనియాడారు. ఆటలో నైపుణ్యం నేర్పించి ఉన్నతస్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత కూడా వారిలో ఉందని చెప్పారు. ఈనెల చివరిన రిటైర్‌ కానున్న వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను శనివారం సిద్దిపేట అర్బన్‌ మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ త్వరలో జరగనున్న పాఠశాల స్థాయి క్రీడా పోటీల్లో వారు సత్తా చాటాలని అన్నారు. కార్యక్రమంలో పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెజ్లింగ్ అకాడమీకి ఎంపిక

అక్కన్నపేట(హుస్నాబాద్): హనుమకొండ జిల్లా కేంద్రంలోని రెజ్లింగ్ అకాడమీకి అక్కన్నపేట మండలం గౌరవెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు బైరి ప్రవీణ, బండి రిషికేశ్ ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ జంగపల్లి వెంకటనర్సయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన రెజ్లింగ్ అకాడమీ ఎంపిక పోటీల్లో పాల్గొని చక్కటి ప్రతిభను కనబరిచారని తెలిపారు. వీరి ఎంపికపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.జ్యోతి, ఉపాధ్యాయులు రామన్ బాబు, నోముల చంద్రారెడ్డి, అడేపు శ్రీనివాస్, కృష్ణకుమారి, మంజు, రాజన్న, రామ, రైసా నస్రిన్, వెంకట్రామి రెడ్డి తదితరులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఐకేపీ డీపీఎం వాసుదేవ్

కోహెడ(హుస్నాబాద్): రాష్ట్ర ప్రభుత్వం స్త్రీనిధి ద్వారా మహిళలకు మంజూరు చేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐకేపీ డీపీఎం వాసుదేవ్ అన్నారు. శనివారం సింగరాయ మండల సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా శక్తి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న పలు నిధులను వివరించారు. మహిళలకు స్త్రీనిధి ద్వారా పాడి గేదెలు, ఆవులు కొనుగోలుకు రూ.93,270 అందజేస్తుందన్నారు. సక్రమంగా నిధులు సద్వినియోగం చేసుకోవాన్నారు. అలాగే పాడి పశువుల కొనుగోలు, పాడి పశువుల ఎంపిక, ఇన్సూరెన్స్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలను మండల వైద్యాధికారి శ్రవణ్ వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, ఏపీఎం తిరుపతి గౌడ్, సీసీలు రమేశ్, స్వప్న పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపిక



సృజనకు బహుమతి అందిస్తున్న అధికారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన సకురా సైన్స్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో జిల్లా స్థాయిలో రాణించి రాష్ట్ర స్థాయి పరీక్షకు లచ్చపేట మోడల్ స్కూల్ విద్యార్థిని సృజన ఎంపికైంది. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సకురా పరీక్షను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి రామస్వామి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా స్థాయిలో రాణించిన విద్యార్థిని సృజనకు బహుమతి అందించారు. ఈ నెల 30న హైద్రాబాద్‌లో రాష్ట్ర స్థాయి పరీక్షకు సృజన హాజరుకానున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన విద్యార్థులు నవంబర్ 10 నుంచి 16 వరకు జపాన్‌లో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న శాస్త్రవేత్తలను కలువనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్, రిసోర్స్ పర్సన్ సాదత్ ఆలీ, కోటేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ కరెన్సీ కలకలం

మద్దూరు(హుస్నాబాద్): నకిలీ కరెన్సీ నోటు కలకలం సృష్టించిన ఘటన మండల పరిధిలోని మర్మాముల గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మర్మాముల గ్రామంలో విద్యుత్ బిల్ కలెక్టర్ ఇస్తారి వినియోగదారుల నుంచి కరెంట్ బిల్లును సేకరించారు. అయితే అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి విద్యుత్ బిల్లును చెల్లించగా, అతడు ఇచ్చిన దాంట్లో 4ఈడీ669339 నంబరు గల రూ.200 కరెన్సీ నోటు నకిలీగా తేలింది. ఈ నకిలీ కరెన్సీ నోటును తిరిగి అతడికి అందించనున్నట్లు బిల్ కలెక్టర్ తెలిపారు.



ఆట పాటలతో సందడి

సండే స్పెషల్

తండా.. ఉద్యోగులే నిండా..

విద్యావంతులకు నిలయంగా భల్లునాయక్ గిరిజన తండా

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్‌కు 12 కిలోమీటర్ల దూరంలోని జీడిగడ్డకు సమీపంలోని భల్లునాయక్ గిరిజన తండాలో గుడుంబాకు తయారు కేంద్రాలుగా ఉండేవి. ఇదే గిరిజన తండాలో 1984లో ఇద్దరు కునుసోతు భద్రునాయక్, లావుడ్య కిషన్‌నాయక్ డిగ్రీ చదువుతుండగానే ప్రభుత్వ ఉపాధ్యాయులుగా సర్కారు కొలువులు సాధించారు. వీరు గిరిజనుల వృత్తి వ్యవసాయం కలప సేకరణ పనుల నుంచి ఉద్యోగం వైపు వచ్చి తండాలోని యువతను కూడా చదువుకొనే విధంగా చైతన్యం చేశారు. ఇప్పుడు తండాలో 25 మంది టీచర్లు, 10 మంది వైద్యులు, ఐదుగురు ఇంజినీర్లు, ఆరుగురు పోలీసు కానిస్టేబుళ్లు, విద్యుత్ శాఖ ఉద్యోగులు సుమారు 120 పైగా ఉద్యోగులు ఉన్నారు. ఇందులో ప్రభుత్వ ఉద్యోగులు 100 మందికి, ప్రైవేట్ ఉద్యోగులు 20 మందికిపైగా ఉన్నారు.

అందరూ డిగ్రీ చదివిన వారు

తండా జనాభా 921 ఉండగా 150 ఇళ్ల 291 వరకు కుటుంబాలు ఉంటాయి. ఇంటికో ఉద్యోగితోపాటు తండాలో అందరూ డిగ్రీ చదివిన వారు ఉండటం విశేషం. మొదటిసారి ప్రభుత్వం మహిళలకు విద్యుత్‌శాఖలో ఉద్యోగాలు ఇస్తే ఈ తండా నుంచే మొదటి మహిళా లైన్‌మెన్‌గా ఎంపికైంది. ఉద్యోగరీత్యా ఎక్కడ ఉన్న గిరిజన పండుగలకు తండాకు వచ్చి అందరితో కలిసి ఆడి పాడటం గిరిజనుల ఐక్యతకు నిదర్శనం.

సూది మందు తెలియని తండాలో డాక్టర్లు

గిరిజన తండాలో వ్యాధుల బారినపడినప్పుడు సూది మందు తెలివని గిరిజనులు చెట్ల పసరుతో నాటు వైద్యం చేసుకునేవాళ్లు. వ్యాధుల నుంచి పశువులను, పిల్లలను రక్షించాలని కోరుతూ ఆషాఢంలో ప్రకృతిని పూజించే సీత్లా భవానీ, తీజ్ పండుగలను జరుపుకుంటారు. భల్లునాయక్ తండాలో ఇప్పుడు 10 మంది డాక్టర్లు ఎల్.శ్రీనివాస్ విజయలక్ష్మి, డాక్టర్.ఎల్. ధర్మా అనిత, డాక్టర్ ఎల్.వర్షి సుమలత, డాక్టర్. ఎల్ గోపి స్రవంతి, ప్రొఫెసర్ డాక్టర్ ఎల్. శ్రీనివాస్, డాక్టర్ శ్రీధర్ వైద్య విద్యను పూర్తి చేసి వైద్యులుగా కరీంనగర్, హుస్నాబాద్, హన్మకొండ ప్రాంతంలో ప్రజలకు సేవలందిస్తున్నారు. హస్పిటల్స్ పెట్టి పల్లె ప్రజలకు వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చారు. సెలవు రోజుల్లో తండాకు వచ్చిన డాక్టర్లు అందరికీ ఉచిత వైద్యం అందిస్తారు. డాక్టర్ల కృషితో తండాలకు అందుబాటులోకి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రము ఏర్పాటు చేసింది.



పేదలకు అందుబాటులో వైద్యం

మా తండాలో చిన్నప్పుడు జ్వరం వస్తే డాక్టర్ ఉండేది కాదు. సూది మందు కోసం వారం రోజులకు జ్వరం తగ్గకపోతే పక్క ఊరిలో ఉండే వైద్యుడి దగ్గరకు తీసుకపోయేది. తండా నుంచి 12 కిలోమీటర్లు నడిస్తే బస్సు రోడ్డు వచ్చేది. వైద్యం కోసం కరీంనగర్, హన్మకొండ ప్రాంతాలకు వెళ్లి ఆర్థిక కష్టాలను తెచ్చుకొనేవాళ్లం. వైద్యం కోసం పట్టణాలకు వెళ్లలేక కొందరు అనారోగ్యంతో మరణించేవారు. మాకు పేద కుటుంబాల ఆర్థిక జీవన స్థితిగతులు తెలుసు వారికి మా సురక్ష హాస్పిటల్‌లో ఉచితంగానే వైద్య సేవలు అందించి ప్రాణం పోస్తున్నాం.

– డాక్టర్.ఎల్ ధర్మా అనిత దంపతులు

అక్షరాస్యత పెంపులో భద్రునాయక్ ఆదర్శం



భల్లునాయక్ తండా నుంచి 1984లో ఉద్యోగం సాధించిన భద్రునాయక్ 1997 నుంచి 2009 వరకు వయోజన విద్యలో ఎంఎల్‌ఓగా విధులు నిర్వహించి ఊరూరా అక్షరాస్యత కార్యక్రమాలను నిర్వహించి వెనుకబడిన హుస్నాబాద్ ప్రాంతాన్ని అక్షరాస్యతలో ఆదర్శంగా నిలిపాడు. హుస్నాబాద్‌లో 1994 వరకు 60 శాతం ఉన్న అక్షరాస్యతను 2000 సంవత్సరం వరకు 74 శాతం పెంచారు. అక్షర ఉజ్వల, సారాయి నిషేధం, ఎయిడ్స్ నిర్మూలన, కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను గ్రామాల్లో నిర్వహించి వయోజనులకు అక్షరాలు నేర్పించి చదువు పిల్లల భవిష్యత్ నిర్ణయిస్తుందని తల్లిదండ్రులకు జ్ఞానోదయం కల్పించి, పిల్లలను పనులకు కాకుండా బడిలో చేరే విధంగా కృషి చేశాడు. పీపుల్స్‌వార్ ఉద్యమం బలంగా ఉన్న సమయంలో గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలంటే భయపడేవారు. యువతను చేరదీసి కళా బృందాలను ఏర్పాటు చేసుకొని బుర్ర కథలు, నాటకాల ద్వారా ప్రజలను చైతన్యం చేసి యువతను చదువు వైపు మళ్లించడంలో భద్రునాయక్ కృషి ప్రశంసనీయం. తెలంగాణ వచ్చిన తర్వాత 2017లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో ప్రభుత్వం సత్కరించింది. వచ్చే సెప్టెంబర్‌లో 40 ఏళ్ల ఉపాధ్యాయ సర్వీసు నుంచి ఉద్యోగ విరమణ పొందనున్నాడు.



సాంస్కృతిక కార్యక్రమంలో భద్రునాయక్ (ఫైల్)

కట్టె పలకతో కాలినడకనే బడికి



1984లో ఉపాధ్యాయ ఉద్యోగంలో చేరిన 40 ఏళ్ల పిల్లలకు విద్యా బుద్ధులు నేర్పిన. మా తండాను విద్యావంతులుగా తీర్చినం. బడి అంటే తెలువని సమయంలో మా అవ్వ అయ్యా కట్టె పలక చేతికి ఇచ్చి 3 కిలోమీటర్లు దూరం ఉండే బడికి పంపించేది. మా తండాలో నాకే మొదట టీచరు ఉద్యోగం వచ్చింది. నా పిల్లలను డాక్టర్లు, టీచర్లు చేసిన. తండా యువతను ఆర్థిక సహాయం చేసి ఉన్నత చదువులు చదివే విధంగా చైతన్యం చేసిన. నా వెనుక 25 మంది టీచర్లు కావడం గర్వంగా ఉంది. వచ్చే నెలలో ఉద్యోగ విరమణ చేస్తున్నాను.

– లావుడ్య కిషన్‌నాయక్, మొదటి ఉపాధ్యాయుడు

అసిస్టెంట్ ప్రొఫెసర్ వరకు..



నాన్న చదివించి డాక్టర్ అయ్యి తండా ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలని సూచించాడు. మాది వ్యవసాయ కుటుంబం. అన్న టీచరు కావడంతో నేనూ టీచరు కావాలని చదివాను కానీ డాక్టర్ అయ్యాను. హుస్నాబాద్‌లో ఆస్పత్రి పెట్టి పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నాను. కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో జనరల్ సర్జరీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాను.

– డాక్టర్. ఎల్. శ్రీనివాస్, జీఎంసీ, కరీంనగర్

అందరం సీత్లా పండుగకు వస్తాం



మా తండా పెద్దవారు ఉద్యోగాలు సాధించి మాకు ఆదర్శంగా నిలిచారు. మేం ఇద్దరం టీచర్లమే అయినా పండుగ వస్తే ఎక్కడ ఉన్నా పిల్లలతో కలిసి తండాకు వచ్చి సీత్లా, తీజ్ పండుగలు జరుపుకుంటాం. మా వేషధారణ మారినా సంస్కృతిలో, ఆహారంలో మార్పు ఉండదు. పండుగ వస్తే అందరం అడవిలోనే ఆటపాటతో ఆనందంగా గడుపుతాం.

– శారద, టీచరు, భల్లునాయక్

బ్యాగ్, చెప్పులు కొనివ్వలేదని..

ఉరి వేసుకొని విద్యార్థిని ఆత్మహత్య



ఫాతిమా మృతదేహం

పటాన్‌చెరు టౌన్: కాలేజీ బ్యాగ్, చెప్పులు కొనివ్వలేదని విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ బజ్జా నాయక్ కథనం మేరకు.. అమీన్‌పూర్ డబుల్ బెడ్ రూమ్ వద్ద నివాసం ఉండే జావిద్ ఆటో డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. జావిద్ కూతురు బూస్రా ఫాతిమా(18) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ డిగ్రీ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతోంది. శుక్రవారం ఫాతిమా తల్లి జరీనా బేగంను చెప్పులు, కళాశాల బ్యాగ్ కావాలని అడుగగా తర్వాత ఇప్పిస్తానని చెప్పింది. దీంతో కోపంగా రూమ్‌లోకి వెళ్లి తలుపులు వేసుకుంది. రాత్రి భోజనానికి పిలువడానికి కుటుంబ సభ్యులు తలుపులు తెరిచి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించింది. వెంటనే కుటుంబ సభ్యులు బీరంగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా ఫాతిమాను పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. మృతురాలి తండ్రి జావీద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధింపులు తట్టుకోలేక భార్య..

భర్త వేధింపులు తట్టుకోలేక భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. ఏపీలోని గుంటూరు జిల్లా శ్రీనివాసరావు పేటకు చెందిన అనిల్ కుమార్ కూతురు హర్షిత(22)ను ఈ ఏడాది ఫిబ్రవరి 23వ తేదీన అదే జిల్లా యడ్లపాడు గ్రామానికి చెందిన అంగడి మహేశ్ (25)తో ప్రేమ వివాహం జరిపించాడు. వివాహ సమయంలో అల్లుడికి రూ.3 లక్షలు కట్నంగా ఇచ్చాడు. నాలుగు నెలల నుంచి మహేశ్ భార్య హర్షితతో కలిసి అమీన్‌పూర్ మండలంలోని పటేల్‌గూడ గ్రామంలోని సిద్ధార్థ ఎంక్లేవ్ లో నివాసం ఉంటున్నాడు. మహేశ్‌కు ఉద్యోగం లేకపోవడంతో మామ అనిల్ కుమార్ ప్రతినెలా రూ.30 వేలు పంపించేవాడు. ఇటీవల అతడికి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఆఫర్ లెటర్ వచ్చినా చెప్పకుండా గోప్యంగా ఉంచాడు. ప్రతినెలా డబ్బులు పంపాలని అడగడంతోపాటు ఆస్తిలో తనకు వాటా ఇవ్వాలని మహేశ్ భార్యను వేధించసాగాడు. వేధింపులు తట్టుకోలేక హర్షిత శుక్రవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అల్లుడి వేధింపులతో తన కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ సదా నాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



హర్షిత (ఫైల్)

రిజర్వేషన్లు మార్చాలి

ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రభాకర్

కొల్చారం(నర్సాపూర్): స్థానిక సంస్థల ఎన్నికలకు ఐదేళ్లకోసారి రిజర్వేషన్లు మార్చాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం ప్రభాకర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థ ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం తాము హర్షిస్తున్నామన్నారు. ఇదే సమయంలో పదేళ్లకోమారు కాకుండా దేశంలోని అన్ని రాష్ట్రాల మాదిరిగా మన రాష్ట్రంలోనూ రిజర్వేషన్లు కొనసాగించాలన్నారు. కొన్ని గ్రామాల్లో పూర్తిగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఓసీలకు కూడా అందని రిజర్వేషన్లు ఉన్నాయని, ప్రతీ ఐదేళ్లకోమారు రిజర్వేషన్ల మార్పు కచ్చితంగా ఉండాలన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ల మార్పు ఎంతైనా అవసరం, పాత విధానం కొనసాగకుండా చూడాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరుతున్నామన్నారు.రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే ఎమ్మార్పీఎస్ తరపున ఉద్యమించక తప్పదన్నారు.

చెట్టును ఢీకొట్టిన బైక్

ఒకరు మృతి, మరొకరికి గాయాలు

ములుగు(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండలంలోని కొత్తూరు గ్రామ శివారులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ములుగు ఎస్‌ఐ విజయ్ కుమార్ కథనం మేరకు.. మండల కేంద్రమైన ములుగుకు చెందిన బుల్లి సాయికుమార్(22) డీసీఎం డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. సాయి కుమార్ వద్దకు అదే గ్రామానికి చెందిన స్నేహితుడు తిగుళ్ల శివకుమార్ రాత్రి వచ్చాడు. ఇద్దరూ కలిసి బైక్‌పై బయటకు వెళ్లారు. రాత్రి 12 గంటల సమయంలో కొత్తూరు గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, శివకుమార్‌కు గాయాలయ్యాయి. మృతుడి తండ్రి అశోక్ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పరిశ్రమలో కార్మికుడు..

పటాన్‌చెరు టౌన్: పరిశ్రమంలో కార్మికుడు మృతిచెందిన ఘటన పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆసిఫ్ అలీ కథనం మేరకు.. ఒరిస్సాకు చెందిన సంతోష్ సాహు అలియాస్ సంతోష్ కుమార్ సాహు (44) పటాన్‌చెరు పారిశ్రామిక వాడలోని నవరత్న కాస్టింగ్ కంపెనీలో హెల్పర్ గా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం కంపెనీలో ఛాతిలో నొప్పి వస్తుందంటూ పడిపోయాడు. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు వెల్లడించారు. పరిశ్రమ యాజమాన్యంతో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడారు. పరిశ్రమలో విధులు నిర్వహిస్తుండగా కార్మికుడు మృతి చెందాడని, నష్ట పరిహారం కింద కూతురి పేర రూ.ఐదు లక్షలు, అంత్యక్రియలకు రూ.50 వేలు చెల్లించేలా ఒప్పందం చేసినట్లు ఆయన తెలిపారు.

ఆరుగ్యారంటీల అమలుకు కృషి చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్కా రాములు



సమావేశంలో మాట్లాడుతున్న చుక్కా రాములు

మెదక్ కలెక్టరేట్: రాష్ట్రంలో జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం చెప్పిన ఆరు గ్యారంటీలు అమలు కోసం కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్కా రాములు డిమాండ్ చేశారు. శనివారం మెదక్ జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో సీపీఎం పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చుక్కరాములు మాట్లాడుతూ.. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మెదక్‌కు ప్రాధాన్యత బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. అనేక సందర్భాల్లో ప్రభుత్వం చెప్పినట్లుగా ఆరుగ్యారంటీలు ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. లక్ష లోపు రుణమాఫీ చేసినప్పటికీ బ్యాంకుల్లో లోన్ మాఫీ కావాలంటే కొంత డబ్బులు కట్టించుకోవడం సరికాదన్నారు. కేంద్రంలో 3వ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొడుతుందని గుర్తుచేశారు. కేవలం కార్పొరేట్ శక్తులకోసం పరిపాలన చేస్తుందన్నారు. పార్లమెంట్ బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చేయి చూపించారని ఆరోపించారు. రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలున్నా కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏమి తీసుకురాక పోవడం అన్యాయం అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నర్సమ్మ, మల్లేశం, బస్వరాజు, మహేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గుడి చెంత గంజాయి గుప్ప

వ్యక్తి అరెస్ట్, 50 గ్రాములు స్వాధీనం



మాట్లాడుతున్న రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): గుడి చెంత గంజాయి విక్రయానికి పాల్పడుతున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన వర్గల్ మండలం చాంద్‌ఖాన్‌మక్త పెద్దమ్మ తల్లి గుడి వద్ద శనివారం చోటు చేసుకుంది. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి కథనం మేరకు.. చాంద్‌ఖాన్‌మక్త పెద్దమ్మతల్లి గుడి వద్ద గంజాయి విక్రయాలు కొనసాగుతున్నట్లు శుక్రవారం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జానకీరాంరెడ్డి, గౌరారం పోలీసులకు సమాచారం వచ్చింది. అక్కడికి చేరుకున్న టాస్క్‌ఫోర్స్, గౌరారం పోలీసులకు బీహార్ రాష్ట్రానికి చెందిన మానగం వినయ్‌కుమార్(28) బైక్ మీద అనుమానాస్పదంగా కన్పించాడు. అతడి బైక్‌లో 50 గ్రాముల గంజాయి ప్యాకెట్‌ను గుర్తించారు. వెంటనే అదుపులోకి తీసుకొని విచారించగా సమీప రైస్ మిల్‌లో హమాలీగా పని చేస్తున్నట్లు, కొంత కాలం నుంచి బీహార్‌కు చెందిన వీరు చౌదరి వద్ద గంజాయి కొని తాగడంతోపాటు చుట్టుపక్కల గ్రామాల వారికి విక్రయిస్తున్నట్లు వెల్లడైందని సీఐ పేర్కొన్నారు. నిందితుడి నుంచి 50 గ్రాముల గంజాయి, మొబైల్‌ఫోన్, మోటార్‌సైకిల్ స్వాధీనం చేసుకొని రిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు.

ఏడు చోరీలు.. ఇద్దరు నిందితుల అరెస్ట్

- 10 తులాల బంగారం, విదేశీ కరెన్సీ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రవీందర్ రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవీందర్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు పాత నేరస్తులను అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో అమీన్‌పూర్ సీఐ సదా నాగరాజుతో కలిసి డీఎస్పీ రవీందర్ రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని ఐలాపూర్ చౌరస్తా వద్ద శనివారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. బైక్ పై వెళ్తున్న ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించగా పాత నేరస్తులుగా తేలింది. బొల్లారం గ్రామం చర్చి బస్తీకి చెందిన ఇరగదిండ్ల రవి, దాసరి సోమశేఖర్ ఇద్దరూ బొల్లారం, దుండిగల్, అమీన్‌పూర్ పరిధిలోని మొత్తం ఏడు ఇళ్లల్లో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. వెంటనే వీరి వద్ద నుంచి 10 తులాల బంగారం, బొల్లారం పరిధిలో దొంగలించిన విదేశీ కరెన్సీ, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన అమీన్‌పూర్ సీఐ సదా నాగరాజు, బొల్లా రం సీఐ గంగాధర్, అమీన్‌పూర్ క్రైమ్ సీఐ శేఖర్, ఎస్‌ఐ మల్లయ్య, హెడ్ కానిస్టేబుల్ రాములు, ప్రభాకర్, అమృత్, సాయిలు, ప్రేమ్ సింగ్, కృష్ణగౌడ్‌లను డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు సీఐ ప్రవీణ్ రెడ్డి, క్రైమ్ సీఐ రాజు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామస్తులు ఆందోళన చెందొద్దు

రాష్ట్ర జోనల్ మలేరియా అధికారి డాక్టర్ సునీల్



రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ సునీల్

రామాయంపేట(మెదక్): సుతారిపల్లిలో వచ్చింది సాధారణ జ్వరాలేనని, గ్రామస్తులు ఆందోళన చెందొద్దని రాష్ట్ర జోనల్ మలేరియా అధికారి డాక్టర్ సునీల్ పేర్కొన్నారు. శనివారం ఆయన గ్రామాన్ని సందర్శించిన అనంతరం హెల్త్‌క్యాంపును పరిశీలించి వైద్య సిబ్బంది, రోగులతో వేర్వేరుగా మాట్లాడారు. ముందుగా గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని, పెంట కుప్పలను తొలగించడంతోపాటు మురికి నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. ఇళ్లలో డ్రమ్ములు, పూల కుండీలు, పాత టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ప్రతీ శుక్రవారం డ్రై డే నిర్వహించాలని సూచించారు. గ్రామంలో మరో రెండు, మూడు రోజుల పాటు హెల్త్ క్యాంప్ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జోనల్ మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ నాగయ్య, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి డాక్టర్ విజయేందర్, ప్రగతి ధర్మారం ఆస్పత్రి డాక్టర్ హరిప్రియ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మీ కోసమే.. మేమున్నాం

సిద్దిపేట ఏసీపీ మధు



మాట్లాడుతున్న ఏసీపీ మధు

సిద్దిపేటరూరల్: ప్రజల రక్షణతోపాటు భద్రతాభావాన్ని పెంచడానికి మీ కోసమే మేము ఉన్నామంటున్నారు సిద్దిపేట ఏసీపీ మధు. శనివారం మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో రూరల్ ఎస్‌ఐ అపూర్వరెడ్డి ఆధ్వర్యంలో ప్రజలతో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏసీపీ మధు హాజరయ్యారు. ఈ సందర్భంగా 6 బృందాలుగా ఏర్పడ్డ పోలీసులు గ్రామంలోని అన్ని వీధులు, అనుమానాస్పద ప్రాంతాల్లో జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 25 బైక్‌లను తనిఖీ చేశారు. బెల్టు షాపుల్లో రూ.6 వేల ఖరీదు మద్యం, రూ.3 వేల ఖరీదు గుట్కాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఏదైనా సమస్యలకు 100 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీను, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీబాబు, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, చిన్నకోడూరు ఎస్‌ఐ బాలక్రిష్ణ, బెజ్జంకి ఎస్‌ఐ కృష్ణారెడ్డి, రాజ్‌గోపాల్‌పేట ఎస్‌ఐ ఆసిఫ్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.